సాక్షి
చిత్తూరు
గురువారం । 26 । జనవరి । 2023



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.54,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,100
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.70,000
రిటైల్ వెండి గ్రాము	రూ.73

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	31	17
తిరుపతి	31	17
తిరుమల	27	13
గూడూరు	31	20
నగరి	32	18



సైకత గణతంత్రం

చిల్లకూరు: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మండలంలోని సముద్రతీరం వద్ద ఏరూరు గ్రామానికి చెందిన సైకత శిల్పి మంచాల సనత్‌కుమార్ సైకత శిల్పం రూపొందించారు.

న్యూస్‌రీల్

అవార్డు జిల్లాకు అంకితం

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్


గవర్నర్ చేతుల మీదుగా అవార్డు స్వీకరిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

చిత్తూరు కలెక్టరేట్ : అవార్డు చిత్తూరు జిల్లాకు అంకితం చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరి నారాయణన్ తెలిపారు. జిల్లాలో ఓటు నమోదు ప్రక్రియ, ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానంలో జిల్లాను మొదటి స్థానంలో నిలిపేందుకు కలెక్టర్ చేసిన కృషికి రాష్ట్ర ఎన్నికల సంఘం ఉత్తమ జిల్లా ఎన్నికల అధికారిగా అవార్డు ప్రకటించింది. బుధవారం రాష్ట్ర స్థాయిలో విజయవాడలో జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ బిశ్వభూషన్ హరిచందన్ చేతుల మీదుగా కలెక్టర్ అవార్డును స్వీకరించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా కలెక్టర్ ను అభినందించారు. కలెక్టర్ మాట్లాడుతూ, ఓటు హక్కు ఎంతో పవిత్రమైనదని ఆయన పైవిధంగా ప్రకటించారు.

క్షయ బాధితులకు నిత్యావసరాల కిట్లు

చిత్తూరు రూరల్: జిల్లాలో 900 మంది క్షయ బాధితులకు గురువారం నుంచి నిత్యావసర సరుకుల కిట్లను పంపిణీ చేసేందుకు జిల్లా క్షయ నివారణ అధికారులు సిద్ధమయ్యారు. కంది, శెనగపప్పు, వంట నూనె, పాల పౌడర్ కేజీ చొప్పున ఇవ్వనున్నట్లు జిల్లా క్షయ నివారణ అధికారి రవిరాజు చెప్పారు. ఈ కిట్లు బుధవారం చిత్తూరుకు చేరాయి.

ఆధ్యాత్మిక యాత్రలో

అంతులేని విషాదం

యువకులు చేపట్టిన ఆధ్యాత్మిక యాత్ర వారి కుటుంబాల్లో అంతులేని విషాదాన్ని మిగిల్చింది. ఈ యాత్రలో మొదటి క్షేత్రం తిరుమల శ్రీవారిని మాత్రమే ఆ బృందం దర్శించుకోగలిగింది. అనంతరం అక్కడి నుంచి విఘ్ననాయకుడి దర్శనానికి బయల్దేరింది. విరామం లేని సుదూర ప్రయాణంలో డ్రైవర్‌కు విశ్రాంతి కరువైంది. అదే సమయంలో మృత్యువు వెంటాడి సగం మందిని కబళించేసింది. మిగిలినవారి పరిస్థితి విషమంగా ఉంది. సమాచారమందుకున్న యువకుల కుటుంబాల్లో తీరని శోకం నిండిపోయింది.

- కల్వర్టును ఢీకొన్న కారు
- ఐదుగురి దుర్మరణం
- మరో నలుగురి పరిస్థితి విషమం
- వీడియో కాల్ ద్వారా మృతులను గుర్తించిన కుటుంబీకులు



కల్వర్టును ఢీకొన్న కారు (ఇన్‌సెట్) రుయాలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

చంద్రగిరి: మహారాష్ట్రలోని 9 మంది మిత్రుల బృందం ఆధ్యాత్మిక యాత్రకు బయల్దేరింది. సోలాపూర్‌కు చెందిన రాహుల్ ఇరాని(డ్రైవరు), అంతర్ అనంత్ తెంబుకర్, మయూర్ మట్టన్, రిషికేష్ జంగం, అజయ్ నంగ్‌నాత్ లుత్తే, సునీల్, యాష్ పాటిల్, రోహన్ ఇరాని(డ్రైవరు), సుగన్య నీల్కర్, సునీల్‌లు ఆధ్యాత్మిక యాత్రకు సోమవారం టవేరా వాహనంలో పయనమయ్యారు. మంగళవారం రాత్రి తిరుమల చేరుకుని శ్రీవారిని దర్శించుకుని అర్ధరాత్రి తిరుపతికి చేరుకుని అక్కడే బస చేశారు. బుధవారం ఉదయం మిత్రులందరూ అల్పాహారం స్వీకరించి, ముందుగా కాణిపాక వరసిద్ధి వినాయక స్వామిని దర్శించుకోవడానికి బయల్దేరారు. చంద్రగిరి మండలంలోని పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి కల్‌రోడ్డుపల్లి వద్ద వెళ్తున్న క్రమంలో వాహనం రోడ్డు పక్కన ఉన్న కల్వర్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో అంతర్ అనంత్ తెంబుకర్(20), మయూర్ మట్టన్(25), రిషికేష్ జంగం (30), అజయ్ నంగ్‌నాత్ లుత్తే(31) అక్కడికక్కడే దుర్మరణం చెందారు. సంఘటన స్థలంలో భారీ శబ్దం రావడంతో ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు 108కు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది మిగిలిన ఐదుగురి క్షతగాత్రులను హుటాహుటిన తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. రుయా ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతూ అంబదాస్ కుమార్(22) మృతి చెందగా, మిగిలిన నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యాధికారులు తెలిపారు.

వీడియో కాల్ ద్వారా మృతులు, క్షతగాత్రుల గుర్తింపు

ప్రమాదంలో మృతి చెందిన మృతులు, క్షతగాత్రుల వివరాలను సీఐ ఓబులేసు వీడియో కాల్ ద్వారా గుర్తించారు. ప్రమాదం జరిగిన అనంతరం మృతులకు సంబంధించిన కొన్ని సెల్‌ఫోన్‌లకు కాల్స్ రావడంతో జరిగిన ప్రమాదాన్ని ఆయన వివరించారు. తమ వారిని వీడియో కాల్ ద్వారా చూపించాలని కోరడంతో వారి అభ్యర్థన మేరకు ఆయన వీడియో కాల్ చేశారు. ఈ క్రమంలో మృతి చెందిన వారితో పాటు గాయపడిన వారి వివరాలను తెలుసుకున్నారు.

సుమారు 900 కి.మీ. ప్రయాణం

సుమారు 900 కిలోమీటర్ల దూరంలో ఉన్న సోలాపూర్ నుంచి కారులో రావడంతో పాటు డ్రైవరుకు విశ్రాంతి లేకపోవడం ప్రమాదానికి కారణాలుగా తెలుస్తోంది. ఇద్దరు డ్రైవర్లు ఉన్నప్పటికీ వాహనాన్ని ఎవరు నడపారనేది స్పష్టంగా తెలియరాలేదు. కారులో సామర్థ్యానికి మించి ప్రయాణించడం ప్రమాదానికి ఒక కారణంగా అధికారులు భావిస్తున్నారు.

శభాష్ పోలీస్...

ఆధ్యాత్మిక యాత్రకు వచ్చి రోడ్డు ప్రమాదంలో కొందరు మృతి చెందగా మరికొందరు తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ దీన స్థితిలో ఉన్నారు. ఊరు గాని ఊరు వచ్చి దిక్కులేని స్థితిలో ఉన్న యాత్రికులకు పోలీసులు అండగా నిలిచారు. బాధిత బంధువులతో చంద్రగిరి సీఐ ఓబులేసు నిత్యం మాట్లాడుతూ సమాచారం ఇవ్వడమే కాకుండా మెరుగైన చికిత్స ఇప్పించేందుకు రుయా అధికారులతో సంప్రదిస్తూ మానవత్వాన్ని చాటుకున్నారు.

ఘటన స్థలాన్ని పరిశీలించిన ఏఎస్పీ

ప్రమాద సమాచారాన్ని తెలుసుకున్న అడిషనల్ ఎస్పీ కులశేఖర్, డీఎస్పీలు నరసప్ప, విజయశేఖర్, సీఐ ఓబులేసు తమ సిబ్బందితో కలసి ఘటన స్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి గల కారణాలను స్థానికుల నుంచి అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను తిరుపతి మెడికల్ కళాశాలకు తరలించారు. అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ, మహారాష్ట్ర సోలాపూర్‌కు చెందిన భక్తులు కాణిపాకం వెళ్లి అక్కడి నుంచి వేలూరులోని గోల్డెన్ టెంపుల్ వెళ్లేందుకు బయల్దేరారని చెప్పారు. ఈ క్రమంలో ప్రమాదం జరిగి ఐదుగురు మృతి చెందగా, మరో నలుగురు తీవ్ర గాయాలపాలైనట్లు ఆయన తెలిపారు. కల్వర్టును ఢీకొన్న క్రమంలో కారు ఎక్కడా బ్రేకులు వేసినట్లు కానీ, స్కిడ్ అయిన గుర్తులు కానీ కనిపించలేదన్నారు. అతివేగం కారణమా లేదా డ్రైవరు నిద్రలోకి జారుకున్నాడా, లేకపోతే మరేదైనా కారణాలు ఉన్నాయన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.


మృతదేహాలను సిబ్బందితో కలసి వ్యానులోకి ఎక్కిస్తున్న సీఐ ఓబులేసు

పవన్ నీకు ప్రజాస్వామ్యానికి అర్థం తెలుసా?

- డిప్యూటీ సీఎం నారాయణస్వామి సూటి ప్రశ్న


మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

పెనుమూరు(కార్వేటినగరం): ప్రజాస్వామ్యానికి అర్థం, విలువ తెలియని వ్యక్తి బాబు దత్తపుత్రుడు పవన్‌కల్యాణ్ అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి విమర్శించారు. బుధవారం పెనుమూరు మండలం సన్యాసిపల్లెలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు ఏరోజూ మాటమీద నిలబడిన పాపాన పోలేదని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీచేసి అధికారాన్ని చేజిక్కించుకున్నారని దుయ్యబట్టారు. అలాంటి నాయకుడి చంకనెక్కిన పవన్ కల్యాణ్‌కి కూడా ప్రజాస్వామ్యం విలువలు లేవని మండిపడ్డారు. గతంలో కాపులను తిట్టి ఆడి పోసుకున్న చంద్రబాబును ఎందుకు కలుస్తున్నారో.. ఎంత ప్యాకేజీకి అమ్ముడుపోయారో ప్రజలకు పవన్ కల్యాణ్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాపుల సంక్షేమానికి ముద్రగడ పద్మనాభం ఉద్యమిస్తే వారి కుటుంబాన్ని తీవ్రంగా వేధించి కేసులు బనాయించినప్పుడు పవన్ కల్యాణ్ ఎక్కడ దాక్కున్నారని ప్రశ్నించారు. అన్ని వర్గాలతో పాటు కాపుల సంక్షేమానికి కూడా తమ ప్రభుత్వం నిబద్ధతతో కృషి చేస్తున్నా కువిమర్శలు చేస్తున్న పవన్ కల్యాణ్ నిజమైన కాపుల ద్రోహి అని.. కాపులు ఆయనను క్షమించబోరని హెచ్చరించారు. ఇకనైనా వాస్తవాలేమిటో గ్రహించాలని హితవు పలికారు.

సంక్షేమం, అభివృద్ధే లక్ష్యం


వెంకట దాసరపల్లెలో సచివాలయం ప్రారంభోత్సవంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- వెంకట దాసరపల్లెలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం ప్రారంభం

పులిచెర్ల(కల్లూరు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర అభివృద్ధితోపాటు ప్రజా సంక్షేమమే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్నారని రాష్ట్ర అటవీ, విద్యుత్, పర్యావరణ, భూగర్భ గనుల శాఖామంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పునరుద్ఘాటించారు. బుధవారం మండలంలోని వెంకట దాసరపల్లెలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టి, సేవలు త్వరితగతిన అందేలా చేసిన ఘనత సీఎంకే దక్కుతుందన్నారు. కులమతాలు, పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చేస్తున్నారన్నారు. సచివాలయం, రైతు భరోసా కేంద్రాల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీటీడీ పాలక మండలి సభ్యుడు పోకల అశోక్ కుమార్, ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, రెడ్డీశ్వరరెడ్డి, వల్లివేడు రాజారెడ్డి, పోకల చంద్ర, నాదమునిరెడ్డి, సర్పంచ్ లక్ష్మి, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో టీడీపీ నేత చేరిక


పార్టీలో చేరిన కరీం సాహెబ్‌తో మంత్రి పెద్దిరెడ్డి

సదుం: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలో టీడీపీ ముస్లిం మైనారిటీ మండల వైస్ ప్రెసిడెంట్, బూరగమంద వార్డు సభ్యుడు కరీంసాహెబ్ బుధవారం వైఎస్సార్ సీపీలో చేరారు. మంత్రి స్వగృహం వద్ద ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, నియోజకవర్గ అభివృద్ధికి ఆకర్షితుడై పార్టీలో చేరినట్లు కరీం చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వెంకటరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, గణేష్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, భగీరథరెడ్డి పాల్గొన్నారు.

పరేడ్ రిహార్సల్


గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ

చిత్తూరు అర్బన్: 74వ గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని జిల్లా పోలీసు ట్రైనింగ్ సెంటర్ పరేడ్ గ్రౌండ్‌లో బుధవారం రిహార్సల్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ వై.రిశాంత్ రెడ్డి గౌరవ వందనం స్వీకరించారు. ముఖ్య అతిథుల హాజరు, జాతీయ పతాకావిష్కరణ,గౌరవ వందన సమర్పణ, వాహనంపై వెళ్లి పరేడ్ పరిశీలించడం..ఇత్యాది అంశాలపై రిహార్సల్ చేయించారు. ఏఎస్పీలు జగదీష్, నాగేశ్వరరావు, డీఎస్పీలు శ్రీనివాసరెడ్డి, తిప్పేస్వామి, మురళి పాల్గొన్నారు.

కొత్తపంటల సాగుతో రైతులకు ఆదాయం

- డిమాండ్ ఉన్న పంటలనే సాగు చేయాలి
- అసిస్టెంట్ కలెక్టర్ మేఘస్వరూప్


కల్లాడులో సుబ్రమణ్యం రెడ్డి సాగు చేసిన జలపినో పంటను పరిశీలిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ మేఘస్వరూప్

సాక్షి ఎఫెక్ట్..

పలమనేరు: సాంప్రదాయ వ్యవసాయ పద్ధతుల్లో కాకుండా కాస్త విభిన్నంగా ఆలోచించి మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను రైతులు సాగుచేస్తే లాభదాయకంగా ఉంటుందని అసిస్టెంట్ కలెక్టర్ మేఘస్వరూప్ అన్నారు. 'కొత్తపంట..లాభాల బాట' శీర్షికతో ఈనెల 23న సాక్షి దినపత్రికలో వెలువడిన పలమనేరు మండలం కల్లాడు గ్రామ రైతు సుబ్రమణ్యం రెడ్డి సాగు చేసిన జలపినో పంటను బుధవారం ఆయన పరిశీలించారు. మల్చింగ్ పద్ధతిలో అంతరపంటల సాగు, విదేశాల్లో డిమాండ్ ఉన్న పంటలను సాగుచేస్తున్న రైతు అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. తోట వద్దకే వచ్చి ముందుగా నిర్ణయించిన ధరతో మిరపను కొంటున్నట్టు రైతు చెప్పారు. అనంతరం కొత్రుమాకులపల్లె రైతు సుబ్బారెడ్డి ఏపీఎంఐపీ సాయంతో బిందు సేద్యంతో సాగు చేస్తున్న పంటలను పరిశీలించారు. వీ.కోట మండలంలోని జవ్వనిపల్లెలో మామిడితోటలో నీటి వసతి కోసం రైతు ఏర్పాటు చేసిన నీటి కుంట బాగుందని మెచ్చుకున్నారు. ఇదే మండలంలోని సుద్దలకుప్పంలో రైతు చలపతి లైట్ సిస్టం ద్వారా చేస్తున్న పూలసాగును పరిశీలించారు. ఈ ప్రాంతం కూరగాయ పంటల సాగుకు అనుకూలంగా ఉన్న నేపథ్యంలో కొత్త రకాల పంటలు, నూతన వ్యవసాయ పద్ధతులను రైతుల దరికి తీసుకెళ్లాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డికి సూచించారు. కార్యక్రమంలో హార్టికల్చర్ ఆఫీసర్ లక్ష్మీప్రసూన, అధికారులు, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

ప్రొవిజనల్ స్టోర్‌లో చోరీ

శాంతిపురం: మండల కేంద్రం నడిబొడ్డున ఉన్న ఓ ప్రొవిజనల్ స్టోర్‌లో మంగళ వారం రాత్రి దొంగలు పడ్డారు. బుధవారం ఇది వెలుగులోకి వచ్చింది. స్టోర్ షట్టర్ తాళాలను పగులగొట్టి లోనికి ప్రవేశించిన దొంగలు సుమారు రూ.20 వేల నగదు, మరో రూ.70 వేల విలువైన సిగరెట్లు, ఇతర వస్తువులు చోరీ చేసినట్లు గుర్తించానని దుకాణ యజమాని గుండరాంశిర్వి రాళ్లబూదుగూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై మునస్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఓటే ఆయుధం



మాట్లాడుతున్న జేసీ వెంకటేశ్వర్


ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, అధికారులు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజాస్వామ్యంలో ఓటే ఆయుధమని, ఓటరుగా నమోదైన వారందరూ నిష్పక్షపాతంగా, నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. 13వ జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఓటు హక్కుపై అంబేడ్కర్ భవనం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఓటరు ప్రాధాన్యతను తెలియజేస్తూ ప్రతిజ్ఞ చేయించి జేసీ మాట్లాడారు. తాను ఓటు హక్కు పొందినప్పటి నుంచి ప్రతి ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకుంటున్నట్లు చెప్పారు. ఎపిక్ కార్డుకు ఆధార్ అనుసంధానంలో జిల్లాను మొదటి స్థానంలో నిలిపేందుకు ఎందరో కృషి చేశారని అభినందించారు. డీఆర్‌ఓ రాజశేఖర్ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవడం తమ బాధ్యతగా భావించాలన్నారు. విద్యార్థినీ విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్, పెయింటింగ్ పోటీలలో గెలుపొందిన వారికి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. సీనియర్ సిటిజన్లను సన్మానించారు. కొత్తగా ఓటు హక్కు పొందిన యువకులకు కార్డులు అందజేశారు. అలాగే ఓటు నమోదులో, ఎపిక్ కార్డుకు ఓటర్ అనుసంధానంలో ప్రతిభ కనబరచిన అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ రేణుక, జిల్లా ఎస్సీ వెల్ఫేర్ డీడీ రాజ్యలక్ష్మి, చిత్తూరు తహసీల్దార్ పార్వతి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు బ్యాక్‌లాగ్ పోస్టులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని దివ్యాంగులకు బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయనున్నట్లు జిల్లా దివ్యాంగులు, హిజ్రా, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కలెక్టర్ ఆదేశాల ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. వివిధ కేటగిరీలలో రిజర్వ్ చేసిన 8 పోస్టుల భర్తీ చేయడానికి కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఫిబ్రవరి 9 లోపు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.చిత్తూర్.జీవోవీ వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసే నాటికి అభ్యర్థి వయస్సు 18 ఏళ్లు పైబడి ఉండాలని, అలాగే 2023 జూలై 1నాటికి 52 ఏళ్లు మించి ఉండరాదన్నారు.

పోస్టులు ఏవంటే.. : దృష్టి లోపం గల దివ్యాంగుల్లో (టర్న్ కాక్-మహిళ)-1, ఫౌంటెన్ క్లీనర్-మహిళ-1, బోర్‌వెల్ క్లీనర్ మహిళ-1, వాచ్‌ఉమెన్-1 పోస్టులున్నాయి. అలాగే బధిర మూగ, చెవుడు లోపం కల దివ్యాంగులకు సంబంధించి టైపిస్ట్-2(జనరల్), టెక్నికల్ ఆఫీసర్-1(జనరల్)ఉన్నాయి. ఇక శారీరక లోపం కల దివ్యాంగులకు ఎంపీహెచ్ఎ-1 (పురుషుడు) పోస్టులు భర్తీ చేయనున్నట్లు వివరించారు. దరఖాస్తులను అభ్యర్థి లేదా వారి తరఫున మరెవరైనాగానీ చిత్తూరు కలెక్టరేట్‌లో గడువు తేదీలోపు తీసుకొచ్చి ఇవ్వాలని ఏడీ చెప్పారు.

108లో ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోండి

గూడూరురూరల్/తిరుపతి తుడా : అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్‌లో పని చేసేందుకు అర్హత కలిగిన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు 108 జిల్లా మేనేజర్ పవన్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని 108 ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ పోస్టులకు సంబంధించి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఇందుకు గాను అభ్యర్థులు బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం, బీఎస్సీ లైఫ్ సైన్స్, బీఎస్సీ ఎంఎల్‌టీ, బీ ఫార్మసీ, డీఎంఎల్‌టీ 5 ఏళ్ల అనుభం ఉన్న వారు అర్హులని తెలిపారు. పాకాల, ఏర్పేడు, శ్రీకాళహస్తి, వరదయ్యపాళెం, తడ, చిట్టమూరు, డీవీ సత్రం, డక్కిలి, వెంకటగిరి, వెదురుకప్పం, పులిచెర్ల, బాలాయపల్లి, సూళ్లూరుపేట, బీఎన్ కండ్రిగ, తొట్టంబేడు, వాకాడు, గూడూరు, రొంపిచెర్ల, యాదమరి మండలాల పరిధిలోని 108 వాహనాలలో పని చేసేందుకు ఈఎంటీల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. దరఖాస్తులను నేరుగా తిరుపతిలోని మున్సిపల్ పార్కు సౌత్‌రోడ్డు, మధురానగర్‌లోని 108 జిల్లా కార్యాలయంలో ఈ నెల 28వ తేదీలోగా అందించాలని కోరారు.

వైభవాన్ని చాటేలా పర్యాటక దినోత్సవం


3-కే రన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తదితరులు

– 3కే రన్ ప్రారంభంలో జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే

చిత్తూరు కలెక్టరేట్ : పర్యాటక అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక గాంధీ విగ్రహం నుంచి అంబేడ్కర్ భవనం వరకు 3–కే రన్‌ను జెడ్పీ చైర్మన్‌తోపాటు చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు జెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థులతో పాటు ఉత్సాహంగా పరుగులు తీశారు. అనంతరం అంబేడ్కర్ భవనంలో నిర్వహించిన సమావేశంలో వారిద్దరూ మాట్లాడారు. పర్యాటక వైభవాన్ని చాటేలా జాతీయ పర్యాటక దినోత్సవం నిర్వహించడం అభినందనీయమన్నారు. జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్, డీఆర్‌ఓ రాజశేఖర్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి తదితరులు మాట్లాడారు. పర్యాటక ప్రాంతాలను సందర్శించినప్పుడు కళలు, సంస్కృతులు, సాంస్కృతిక పునరుజ్జీవనం వంటి ఎన్నో అంశాలు తెలుసుకోవచ్చన్నారు. అనంతరం పలు పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు భూపేష్, డీఎల్‌డీఓ రవి కుమార్, పర్యాటక శాఖ అధికారి రూపేంద్రనాథ రెడ్డి, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా స్థాయి సీఎం కప్ ఎంపిక పోటీలు


జిల్లా స్థాయి సీఎం కప్ పోటీల్లో ఎంపికైన విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్ : స్థానిక మెసానికల్ మైదానంలో జిల్లా స్థాయి సీఎం కప్ పోటీలు బుధవారం ముగిశాయని చీఫ్ కోచ్ బాలాజీ విలేకరులకు తెలిపారు. క్రీడల పరంగా విద్యార్థులకు ప్రోత్సహించేందుకు సీఎం కప్ పోటీలను ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో నిర్వహించిన 14 క్రీడల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను ఎంపిక చేసినట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో చిత్తూరుకు తృతీయ స్థానం


తృతీయ స్థానంలో నిలిచి అందుకున్న ట్రోఫీతో జిల్లా కబడ్డీ జట్టు

చౌడేపల్లె: విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలం అలుగోలు ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన 66వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి కబడ్డీ, అండర్ –17 బాలికల విభాగంలో చిత్తూరు జిల్లా జట్టు తృతీయ స్థానం కైవసం చేసుకుంది. బుధవారం జరిగిన పోటీల్లో ఈ స్థానం పొందింది. జిల్లా కబడ్డీ జట్టులో మండలంలోని పుదిపట్ల ఉన్నత పాఠశాల నుంచి ఏడుగురు క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించి సత్తా చాటారు. క్రీడాకారిణులను చిత్తూరు జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు సురేష్‌బాబు, రాము, వసంతమ్మ, పీడీలు రామచంద్ర, వెంకటేష్, రాజేంద్ర అభినందించారు.

మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శిబిరం

- ముందస్తు సమాచారం ఇవ్వలేదని పలువురు మండిపాటు


శిబిరంలో మాజీ సైనికుల ఫిర్యాదులను పరిశీలిస్తున్న అధికారులు

చిత్తూరు కలెక్టరేట్ : మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి చిత్తూరు జిల్లా కేంద్రంలో బుధవారం జిల్లా సైనిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక పరిష్కార శిబిరం నిర్వహించారు. జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి విజయశంకర్‌రెడ్డి మాట్లాడుతూ, మద్రాస్ రెజిమెంట్ రికార్డ్ ఆఫీస్ వెల్లింగ్‌టన్ నుంచి అధికారులు శిబిరానికి హాజరయ్యారని, మాజీ సైనికుల పింఛన్లు, కుటుంబ సభ్యుల పేర్లు, చిరునామా మార్పులు, ఇతర సమస్యలను పరిష్కరించడానికి ఈ శిబిరం ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. అయితే, ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని మాజీ సైనికులకు ముందస్తు సమాచారం ఇవ్వలేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాచారం ఇవ్వకపోవడంతో సమస్యలు పరిష్కరించుకోలేకపోయామని పలువురు మాజీ సైనికులు ఆవేదన వ్యక్తం చేశారు.

విషగుళికలు మింగి వివాహితుడి ఆత్మహత్య

రామకుప్పం: విషగుళికలు మింగి వివాహితుడు మృతి చెందిన ఘటన రామకుప్పం మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. మండలంలోని మణీంద్రం గ్రామానికి చెందిన చిరంజీవి(30) కడుపునొప్పి తాళలేక ఈ నెల 22న విషగుళికలు మింగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన బంధువులు అతన్ని కుప్పం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతుని భార్య కృష్ణతేజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతునికి ఇద్దరు సంతానం.

తాళిబొట్టు చెయిన్ స్నాచింగ్ కేసులో నిందితుడి అరెస్ట్


నిందితుడి అరెస్ట్ చూపుతున్న ఎస్ఐ రవికుమార్

చౌడేపల్లె: పొలం పనుల్లో నిమగ్నమై ఉన్న మహిళ మెడలో బంగారు చైనును లాక్కొని ఉడాయించిన సంఘటనలో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రవికుమార్ బుధవారం తెలిపారు. ఎస్ఐ కథనం ..గడ్డంవారిపల్లె పంచాయతీ యల్లంపల్లెకు చెందిన వై.దొరస్వామి నాయుడు భార్య నీలావతమ్మ ఈనెల 10న సాయంత్రం గ్రామ సమీపంలోని పొలంలో గడ్డి కోస్తూండగా ఆగంతకుడొకడు ముఖం కనిపించకుండా పూర్తిగా టవల్ చుట్టుకుని వచ్చి ఆమె మెడలోని 12 గ్రాముల బంగారు తాళిబొట్టు చైన్‌ను లాక్కుని పరారయ్యాడు. ఆమె తీవ్రంగా ప్రతిఘటించినా ఫలితం లేకుండా పోయింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు.

నిందితుడు గ్రామస్తుడే..!

ఓ వ్యక్తి పోలీసులకు ఇచ్చిన సమాచారంతో నిందితుడి బండారం బట్టబయలైంది. అతడెవరో కాదు సాక్షాత్తు గ్రామస్తుడైన పి.మునిరామయ్య అని తేలడంతో అందరూ విస్తుపోయారు. నీలావతమ్మ వద్ద కొట్టేసిన బంగారు తాళిబొట్టు చైన్‌ను అతడు మండల కేంద్రంలోని ఓ కుదువ దుకాణంలో తాకట్టు పెట్టి రూ.45వేలు తీసుకున్నాడు. ఇది గమనించిన ఓ వ్యక్తి పత్రికల్లో బంగారు చెయిన్ అపహరణ గురించి చదివి ఉండడం..కూలి పనులు చేసే యల్లంపల్లె వాసి బంగారు చెయిన్ తాకట్టు పెట్టడంపై అనుమానించాడు. సమాచారం చేరవేయడంలో పోలీసులు కుదువ దుకాణం మీద వాలారు. ప్రాథమిక విచారణలో యల్లంపల్లె మహిళ నగ అదేనని తేలడంతో రికవరీ చేసుకున్నారు. ఈలోపు మునిరామయ్య పరారయ్యాడు. ఎట్టకేలకు అతడిని బుధవారం అరెస్ట్ చేశారు. పది రోజుల వ్యవధిలో అతగాడు రూ.45వేలను జల్సా చేసినట్లు తేలింది. నిందితుడిని న్యాయమూర్తి ఎదుట హాజరు పరచగా రిమాండ్‌కు ఆదేశించారు. ఇక నగ అపహరణకు గురైనప్పటి నుంచి కంటికి కునుకు కరువైన నీలావతమ్మ ఇప్పుడు ఫుల్ హ్యాపీ.. హమ్మయ్య నగ మళ్లీ తన చెంతకు చేరుతుందని! ఇక నగకు నగా పాయె..డబ్బుకు డబ్బూ పాయె! మళ్లీ పోలీసులు ఏ క్షణంలో తన దుకాణం మీద వాలుతారోనని కుదువ వ్యాపారికి ఏడుపే మిగిలింది.

వాహనం ఢీకొని విద్యార్థి మృతి


ఆసుపత్రిలో గోకుల్ మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు


గోకుల్(ఫైల్)

సదుం: వాహనం ఢీకొని విద్యార్థి మృతి చెందిన సంఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాలు..తమిళనాడు రాష్ట్రం గుడియాత్తంకు చెందిన శివ, మాలశ్రీ కుమారుడు గోకుల్(9) ఎరుకులపురంలోని అమ్మమ్మ సులోచన వద్ద ఉంటూ, భట్టువారిపల్లె ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. సాయంత్రం పాఠశాల నుంచి ఇంటికి వెళ్తుండగా మృత్యువాత పడ్డాడు. రోడ్డు దాటుతున్న అతడిని కల్లూరు వైపు నుంచి సదుం వైపు వాటర్ బాటిళ్ల లోడుతో వస్తున్న టాటా ఏస్ వాహనం ఢీకుంది. వాహన డ్రైవర్ గాయపడిన విద్యార్థిని స్థానిక సీహెచ్‌సీకి హుటాహుటిన తీసుకువచ్చాడు. అయితే అప్పటికే అతడు మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. బంధువుల రోదనలతో ఆసుపత్రిలో విషాదం నెలకుంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యశ్వికకు వీర్‌గాథ పురస్కారం


కేంద్ర మంత్రి నుంచి పురస్కారం అందుకుంటున్న యశ్విక

శాంతిపురం: కుతేగొనిపల్లి వద్ద ఉన్న శ్రీ పరమహంస యోగానంద పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న వై.యశ్విక జాతీయస్థాయి పెయింటింగ్ పోటీల్లో వీర్‌గాథ పురస్కారాన్ని అందుకుంది. బుధవారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చేతుల మీదుగా రూ.10 వేల నగదు, ప్రశంసా పత్రం, జ్ఞాపిక స్వీకరించింది. అలాగే గురువారం దేశ రాజధానిలో జరిగే రిపబ్లిక్ దినోత్సవ కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం పొందింది. దేశ సైనికుల వీరోచిత పోరాటాలను గుర్తుచేస్తూ వారి వీరగాథలపై 3–5 తరగతుల విద్యార్థులకు సీబీఎస్సీ గత నవంబర్‌లో నిర్వహించిన పోటీల్లో యశ్విక ఈ బహుమతికి ఎంపికైంది. 1947లో పాకిస్తాన్ దాడి నుంచి కశ్మీర్ ఎయిర్‌పోర్ట్‌ను కాపాడే క్రమంలో 24 ఏళ్ల వయసులోనే అమరుడైన మేజర్ సోమనాథ్‌శర్మ ఉదంతంపై ప్రేరణతో యశ్విక గీసిన పెయింటింగ్ జ్యూరీ మన్ననలు అందుకుంది. రాష్ట్రం నుంచి ఈ పోటీల్లో పాల్గొన్న వారిలో యశ్విక మాత్రమే బహుమతి సాధించిందని పాఠశాల ప్రిన్సిపాల్ ఆజాద్ హుస్సేన్ తెలిపారు. పరమహంస విద్యాలయ విద్యార్థిని ప్రతిభకు జాతీయ స్థాయిలో గౌరవం దక్కడంపై చైర్మన్ గోపాల్ జి అగర్వాల్, జాయింట్ కరస్పాండెంట్ రాధాకృష్ణ హర్షం వ్యక్తంచేశారు. కాగా యశ్విక తల్లి దుర్గారాణి రాళ్లబూదుగూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు.